కమ్యూనిటీ హాలు లేక వెతలు!

- మహిళా మండలి సమావేశాలు, శిక్షణ ఇచ్చేందుకు ఇబ్బందులు
- ప్రైవేటు స్థలాలు, భవనాల్లో సమావేశాలు


చిన్నబుచ్చిరాజుపాలెం తాటిపూడి పైప్‌లైన్ రోడ్డులో శిథిలావస్థలో ఉన్న పంప్ హౌస్

గోపాలపట్నం: మహిళలు స్వావలంబన సాధించేందుకు పలు రకాల శిక్షణలు జరుగుతున్నాయి. జీవీఎంసీ 91వ వార్డు చిన్నబుచ్చిరాజుపాలెం, జయప్రకాశ్‌నగర్, రెడ్డి వీధి ప్రాంతాల్లో శిక్షణ ఇచ్చేందుకు తగిన వేదికలు లేకపోవడం వల్ల ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఈ ప్రాంతంలో 20 డ్వాక్రా గూపులు ఉన్నాయి. వీరు ప్రతినెలా సమావేశాలు కావాల్సి ఉంది. అలాగే కుట్టుశిక్షణలు.. ఇతర సదస్సులు నిర్వహించుకోవడానికి కూడా సామాజిక భవనాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. అయితే ఈ ప్రాంతాల్లో రెండు చోట్ల కమ్యూనిటీ హాలు నిర్మించడానికి స్థలాలు ఉన్నా అధికారులు వీటిపై దృష్టి పెట్టడం లేదని వాపోతున్నారు. ఇక్కడి తాటిపూడి పైప్‌లైన్‌రోడ్డులో పంప్‌హౌస్ ఉంది. ఇది పూర్తిగా శిథిలమైపోయింది. దీన్ని తొలగించి రెండంతస్తు భవనం నిర్మిస్తే ఉపయోగకరంగా ఉంటుందని మహిళలు చెబుతున్నారు. అలాగే చిన్న బుచ్చిరాజుపాలెంలో పురాతన బావి నిరుపయోగంగా ఉంది. దీన్ని పూడ్చి ఆ బావి స్థలంలో సామాజిక భవనం నిర్మించాలని కోరుతున్నారు. నిరుపయోగంగా ఉన్నవాటిని ఉపయోగంలోకి తీసుకురావాలని మహిళలు కోరుతున్నారు.

భవనం లేక ఇబ్బందులు



సామాజిక భవనం లేక ఇబ్బందులు పడుతున్నాం.గతంలో పలువురు నాయకులకు విన్నవించాం. ఎవరూ పట్టించుకోవడం లేదు. సామాజిక అవసరాలకు, మహిళా సంఘాల అవసరాలకు ప్రైవేటు భవనాల్లో సమావేశాలు నిర్వహించుకునే పరిస్థితుల్లో ఉన్నాం. అధికారులు, నాయకులు స్పందించాలి

– చుక్క శ్రీదేవి, రెడ్డివీధి, బాజీ జంక్షన్

పంప్‌హౌస్ స్థలాన్ని వినియోగించాలి



శిథిలావస్థలో ఉన్న పంప్ హౌస్ స్థలంలో సామాజిక భవనం నిర్మించాలి. నగర పరిధిలో స్థలాలు లేవు. అలాంటిది ఇక్కడ ఉన్న స్థలాన్ని వదిలేస్తున్నారు. ఇది ఆక్రమణకు గురయ్యే ప్రమాదం ఉంది. దీన్ని ప్రజలకు ఉపయోగపడే విధంగా సామాజిక భవనం నిర్మించాలి.

–పూరెట్టి నాగమణి, రెడ్డి వీధి

బావి పూడ్చి భవనం నిర్మించాలి



చిన్న బుచ్చిరాజుపాలెంలో పాడుబడిన బావి ఉంది. ఏళ్ల తరబడి నిరుపయోగంగా ఉంది. దాన్ని పూడ్చి ఆ స్థలంలో అందరికీ ఉపయోగ పడే విధంగా కమ్యూనిటీ హాలు నిర్మిస్తే బాగుంటుంది. అధికారులు దీనిపై పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలి.

– చుక్క నీరజ, చిన్నబుచ్చిరాజుపాలెం

క్లుప్తంగా

కొనసాగిన వాహనాల తనిఖీ
ప్రత్యేక బోర్డుల తొలగింపు


వాహనాల నుంచి తొలగించిన నంబర్ బోర్డులను పరిశీలిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

గోపాలపట్నం: అనుమతి లేకుండా కార్లకు గౌట్ డ్యూటీ, రవాణా శాఖ, ప్రొటోకాల్ వెహికల్ వంటి ప్రత్యేక బోర్డుల ఏర్పాటుపై ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. పలు వాహనాలను నిలిపి ఆయా బోర్డులు ఎందుకు పెట్టారు.., ఏవిధమైన అనుమతులు ఉన్నాయో ఆరా తీశారు. అనుమతులు లేని వాహనాల నుంచి ఆయా బోర్డులను తొలగించారు. హైసెక్యూరిటీ నంబర్ బోర్డులు కాకుండా డిజైన్ చేసిన నంబర్ బోర్డులను కూడా తొలగించారు. వీటిపై కేసులు నమోదు చేశారు. ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు ఆదేశాల మేరకు ట్రాఫిక్ సిబ్బంది ఈ తనిఖీలు చేపట్టారు.

సమరభేరి పోస్టర్ ఆవిష్కరణ


సీపీఎం సమరభేరి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

మద్దిలపాలెం: పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను నిరసిస్తూ ప్రభుత్వాలపై సమరభేరి మోగించనున్నామని సీపీఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను పిఠాపురంకాలనీలో గల పార్టీ కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఈనెల 30,31 తేదీల్లో పాదయాత్రలు, సంతకాల సేకరణ, సెప్టెంబర్ 1న సచివాలయాల వద్ద ధర్నా, 3వ తేదీన నిరుద్యోగ యూత్ మార్చ్, 4వ తేదీన తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేపట్టనున్నామన్నారు. ఈ కార్యక్రమానికి అన్ని వర్గాల ప్రజల సహకారం అవసరమన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆర్‌కేఎస్‌వీ కుమార్, కృష్ణారావు పాల్గొన్నారు.

29న మెగా రక్తదాన శిబిరం

ఎంవీపీకాలనీ: ఈ నెల 29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని మాంక్‌ఫిట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు సంస్థ ప్రతినిధులు మహేష్, టి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29న ఉదయం 8 గంటల నుంచి ఏయూలోని జిమ్నాజియం ఇండోర్ స్టేడియంలో ఈ శిబిరం జరుగుతుందన్నారు. విశాఖ డీసీపీ విద్యాసాగర్ నాయుడు ముఖ్య అతిథిగా, ఏయూ క్రీడా విభాగం డైరెక్టర్ ఆచార్య ఎస్.వి జయమోహన్ గౌరవ అతిథిగా పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి గల యువత ఈ శిబిరంలో పాల్గొనాలని కోరారు.

యూనియన్లకు గుర్తుల కేటాయింపు

అక్కిరెడ్డిపాలెం: భెల్‌లో ఈ నెల 31న జరగనున్న గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో పోటీలో నిలిచిన యూనియన్లకు గుర్తులు కేటాయించారు. రీజనల్ లేబర్ కమిషనర్ కె.జగన్నాథ్ మహంతి శనివారం వీటిని ప్రకటించారు. ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ పొత్తుతో పోటీలో నిలిచిన ప్రోగ్రెసివ్ ఫ్రంట్‌కు ఉదయించే సూర్యుడు గుర్తును, యునైటెడ్ ఫ్రంట్‌కు సింహం గుర్తును కేటాయించినట్టు తెలిపారు. బీఎంఎస్ కూడా పోటీలో ఉందని ఆ యూనియన్ ప్రతినిధులు తెలిపారు.

నేడు సమావేశాలు

ఎన్నికలు సమీపించడంతో యూనియన్లు ఆదివారం సమావేశాలు నిర్వహిస్తున్నాయి. ప్రోగ్రెసివ్ ఫ్రంట్ ఉదయం 11 గంటలకు గుర్తింపు యూనియన్ కార్యాలయంలో సమావేశం కానుంది. ఆయా యూనియన్ల భాగస్వామ్య పార్టీల నాయకులు పాల్గొంటారు. యునైటెడ్ ఫ్రంట్ (ఏఐటీయూసీ) కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం మింది గుడివాడ అప్పన్న కల్యాణమండపంలో ఆదివారం ఉదయం 10 గంటలకు జరపనున్నట్లు ఫ్రంట్ ప్రతినిధులు తెలిపారు.

నమో వేంకటేశ


తిక్కవానిపాలెం వెంకన్న ఆలయంలో భక్తులు

కంచరపాలెం: శ్రావణ మాస శుద్ధ దశమి సందర్భంగా శనివారం స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. గొల్ల కంచరపాలెం కోదండ సీతారామ, ధనలక్ష్మీదేవి, సంపత్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్చకుడు శ్యామాచార్యులు సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు జరిపారు. పద్మావతి, అలమేలు మంగమ్మ సమేత వెంకన్నకు ప్రాతఃకాల తిరువారాధన, అష్టోత్తరాలు, తులసీదళ బిల్వార్చనలు చేశారు. శ్రీరామా సేవా సమాజం(యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ నేతృత్వంలో సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. సాయంత్రం ఆలయంలో భక్తి సంకీర్తన నిర్వహించారు.

- తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు చామర్తి శంకర్‌శర్మ, జగనాథశర్మ ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు, తులసీదళ బిల్వార్చనలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

రెండో రోజుకు జనజాగరణ దీక్షలు


జనజాగరణ దీక్షలో పాల్గొన్న ఎన్‌సీఈ యూనియన్ సభ్యులు

సింధియా: డిఫెన్స్ కోఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో తూర్పు నావికాదళంలో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలపై చేపట్టిన రెండు దీక్షల్లో భాగంగా నౌకాదళ ప్రధాన కార్యాలయం ఎదుట శనివారం వంటావార్పు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఫెన్స్ కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ రెడ్డి వెంకటరావు మాట్లాడుతూ కమాండ్ పరిధిలోని దీర్ఘకాలిక సమస్యలైన వైద్య సదుపాయాలు, హెచ్ఆర్ఏ పెంపు, ఇంక్రిమెంట్లు, వేతన సవరణ వంటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమానికి వివిధ ట్రేడ్ యూనియన్ల నాయకులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌సీఈ యూనియన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు మారుతి, పి.నాగేశ్వరరావు, ఇతర యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

100 శాతం ప్రవేశాలపై సర్వే జరపాలి

సచివాలయాల ఎడ్యుకేషన్ కార్యదర్శులతో డీఈవో చంద్రకళ


బోరవానిపాలెం పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

ఆరిలోవ: సచివాలయాల ఎడ్యుకేషన్ కార్యదర్శులు గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో (జీఈఆర్–స్థూల ప్రవేశాల నిష్పత్తి) సర్వే 100 శాతం జరపాలని డీఈవో లెంక చంద్రకళ తెలిపారు. జీవీఎంసీ జోన్–2 పరిధి బోరవానిపాలెం, రాజీవ్ గృహకల్ప, జీఎన్‌వో లేఅవుట్, మారికవలస, వాంబేకాలనీ తదితర సచివాలయాలను ఆమె శనివారం సందర్శించి, ఎడ్యుకేషన్ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ప్రతి క్లస్టర్‌లో జీఈఆర్ 100 శాతం సాధించే విధంగా కృషి చేయాలని వారికి సూచించారు. అనంతరం బోరవానిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆమె సందర్శించారు. అక్కడ పాఠశాల పరిస్థితి, గదులు, విద్యార్థుల సంఖ్య, మధ్యాహ్న భోజనం, పూర్తయిన సిలబస్ తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా తరగతి గదులకు వెళ్లి విద్యార్థులను పలకరించారు. వారి వర్క్‌బుక్స్ పరిశీలించారు. క్రమశిక్షణతో చదువుకోవాలని, రోజూ పాఠశాలకు హాజరు కావాలని విద్యార్థులకు సూచించారు.

తక్షణం అద్దె బకాయిలు చెల్లించాలి


ఎంవీపీ రైతుబజార్‌లో మహిళా రైతు కార్డును పరిశీలిస్తున్న మార్కెటింగ్ అధికారి యాసిన్

ఆరిలోవ: రైతు బజార్లలో స్టాళ్లు నిర్వహిస్తున్న రైతులు, డ్వాక్రా మహిళలు తక్షణం అద్దె బకాయిలు చెల్లించాలని జిల్లా వాణిజ్య వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారి షేక్ యాసిన్ తెలిపారు. ఎంవీపీ రైతు బజార్‌ను శనివారం ఆయన సందర్శించారు. ఇక్కడ షాపులు, డ్వాక్రా మహిళల కార్డులు పరిశీలించారు. కేటాయించిన స్టాళ్లలో సంబంధించిన వారే ఉన్నారా లేదా అనే దానిపై ఆరా తీసి, అభివృద్ధి పనులను పరిశీలించారు. ఇటీవల రైతు బజార్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కిలో రూ.46 బియ్యం, కిలో రూ.137 కందిపప్పు స్టాళ్లను సందర్శించారు. ఆయా స్టాళ్లలో నిల్వ ఉన్న సరకుల స్టాక్‌పై ఆరా తీశారు. ఎంత మందికి విక్రయాలు జరిగాయో రికార్డు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బకాయి పడిన వారి స్టాళ్లను నిలిపేయాలని ఎస్టేట్ ఆఫీసర్ జి.ప్రసాద్‌ను ఆదేశించారు. ప్రతి నెలా 10వ తేదీ నాటికి అద్దెలు చెల్లించాలన్నారు. ఇక్కడ ఉన్న అనకాపల్లి జిల్లాకు చెందిన రైతులకు సంబంధించిన వెరిఫికేషన్ కార్డులు ఇంత వరకు విశాఖ మార్కెటింగ్ శాఖ కార్యాలయానికి అందలేదన్నారు. జిల్లా ఉద్యానవనాధికారిని సంప్రదించి వెంటనే కార్డులు పంపించాలన్నారు. లేదంటే వారి కార్డులు రెన్యువల్ చేయడానికి వీలుపడదన్నారు.

'సంగీత కళాకారుల సేవ వెలకట్టలేనిది'

సీతంపేట: సాంస్కృతిక, సినీ సంగీత సంస్థ మెలోడీ క్రియేటర్స్ ఆధ్వర్యంలో శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో 'నిన్ను కోరి వర్ణం' పేరిట నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆద్యంతం అలరించింది. పద్మశ్రీ డాక్టర్ ఎస్.వి.ఆదినారాయణరావు, శశిప్రభ దంపతులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాయనీ గాయకులు, సంగీత కళాకారులు కళారంగానికి చేస్తున్న సేవ వెలకట్టలేనిదని కొనియాడారు. దేశ సంస్కృతి సంప్రదాయంలో కళలకు ఎంతో ప్రాముఖ్యత ఉందని, ఇటువంటి కార్యక్రమాల ద్వారా భావితరాలు వాటిని అందించవచ్చన్నారు. గాయనీ గాయకులు ఎం.ఎస్.మాధవ్, సి.హెచ్.వి.సత్యనారాయణ, సురేష్‌కుమార్, రాము, రత్నం, లక్ష్మీనారాయణ, నాగ్, అభినయ్, శైలజామెరాజ్, కందర్ప రాధ, జ్యోతి, నిహారిక, లక్ష్మీసాత్విక, రితిక పలు హిట్ సాంగ్స్ ఆలపించి ప్రేక్షకులను అలరించారు. మెలోడీ క్రియేటర్స్ సంస్థ అధ్యక్షుడు సీహెచ్.వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్, కళా సంఘాల ప్రతినిధులు కొణతాల రాజు, ఎస్.వి.విజయకృష్ణ, ఉషా చీరాల తదితరులు పాల్గొన్నారు.

మదర్‌థెరిసా సేవలు చిరస్మరణీయం


కార్యక్రమంలో పాల్గొన్న అమ్మానాన్న చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు

మల్కాపురం: పలువురు రోగులు, పేదలక్కు మదర్ థెరిసా అందించిన సేవలు చిరస్మరణీయమని 59వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పుర్రె సురేష్‌యాదవ్, అమ్మా నాన్న చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు రేవళ్ల సత్యనారాయణ అన్నారు. లేబర్ జంక్షన్ వద్ద ట్రస్ట్ ఏడో వార్షికోత్సవంతో పాటు థెరిసా జయంతిని పురస్కరించుకుని శనివారం పలువురు నిరుపేదలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ట్రస్టు ప్రతినిధులు,సభ్యులు పాల్గొన్నారు.

టైం అడిగి.. సెల్‌ఫోన్ లాక్కొని పరారీ

గోపాలపట్నం: ఎన్ఏడీ జంక్షన్‌లో పాదచారుడిపై ముగ్గురు వ్యక్తులు దౌర్జన్యం చేసి సెల్‌ఫోన్ లాక్కొనిపోయారు. ఈ ఘటనకు సంబంధించి ఎయిర్‌పోర్టు క్రైం ఎస్ఐ కాంతారావు తెలిపిన వివరాలు... శుక్రవారం రాత్రి 3 గంటల సమయంలో దొడ్డి నాయుడుతరుణ్ మురళీనగర్‌లోని ఆక్వా టెక్నాలజీలో విధులు ముగించుకుని వస్తున్నాడు. ఎన్ఏడీ జంక్షన్‌లో ద్విచక్ర వాహనంపై వచ్చి టైమ్ అడిగారు. దీంతో సెల్‌ఫోన్ చూసి టైమ్ చెబుతున్న సమయంలో చేతిలో సెల్‌ఫోన్‌ను ఒక్క ఉదుటున లాక్కొని ద్విచక్రవాహనంపై పారి పోయారు. దీంతో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టారు. నిందితులు గవర జగ్గయ్యపాలేనికి చెందిన ముగ్గురు వ్యక్తులు గుర్రాల రాజ్‌కుమార్, గుమ్మడి పైడిరాజు, నల్లా కార్తీక్‌గా గుర్తించారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించారు. వారి నుంచి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

కోస్ట్‌గార్డ్ షిప్ సముద్ర పహెరేదార్ సందర్శన


కోస్ట్‌గార్డ్ షిప్ సముద్ర పహెరేదార్‌ను సందర్శిస్తున్న జర్నలిస్ట్‌లు

సింధియా: జర్నలిస్ట్‌ల కోసం రక్షణ మంత్రిత్వశాఖ నిర్వహిస్తున్న మూడు వారాల డిఫెన్స్ కరెస్పాండెన్స్ కోర్సులో భాగంగా శనివారం విశాఖపట్నంలోని కోస్ట్‌గార్డ్ షిప్ సముద్ర పహెరేదార్‌ను సందర్శించారు. సందర్శనకు వచ్చిన జర్నలిస్ట్‌లకు షిప్ చార్టర్, సంస్థాగత నిర్మాణం.. దాని బాధ్యతలతో పాటు సముద్ర సవాళ్లను పరిష్కరించడంలో షిప్ యొక్క సామర్థ్యాన్ని వివరించారు.

పబ్లిక్ డిమాండ్

బోరును వినియోగంలోకి తేవాలి


నిరుపయోగంగా ఉన్న బోరు

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు రామ్మూర్తిపంతులుపేట పైడిమాంబ అమ్మవారి ఆలయ ఆవరణలోని బోరు నిరుపయోగంగా ఉంది. దీన్ని గతంలో పాదచారులతో పాటు స్థానికులు వినియోగించేవారు. మంచినీటి బోరు నుంచి నీరు సక్రమంగా రాకపోవడంతో సిబ్బంది బోరును డమ్మీ చేసి వదిలేశారు. వర్షాలు బాగా పడుతుండడంతో బోరు మరమ్మతులు చేపట్టాలి. సంబంధిత అధికారులు పర్యవేక్షించి మంచినీటి బోరును వినియోగంలోకి తీసుకురావాలి.

–కె.నిఖిల్, ఆర్పీపేట, కంచరపాలెం.

జీవీఎంసీ పాఠశాలలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన


అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న కార్పొరేటర్ సుధ

మల్కాపురం: మల్కాపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో వసతుల కల్పనకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐవోసీ) సీఎస్సార్ నిధులు రూ. 50 లక్షలు కేటాయించింది. ఈ మేరకు అభివృద్ధి పనులకు శనివారం 61వ వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ శంకుస్థాపన చేశారు. ఆమె మాట్లాడుతూ పాఠశాలలో డైనింగ్ హాల్, ఆర్‌వో ప్లాంట్ ఏర్పాటుకు ఇండియన్ ఆయిల్ సంస్థ ముందుకు రావడవ చాలా సంతోషంగా ఉందన్నారు. దీని వెనుక వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ కృషి ఎంతో ఉందన్నారు. ఆయన ఐవోసీ ప్రతినిధులతో మాట్లాడి ఈ ప్రాజెక్ట్ వచ్చేందుకు కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ఏడీసీ శ్రీనివాసరావు, ఐవోసీ మేనేజర్ సూరజ్‌కుమార్ పట్నాయక్, చీఫ్ ఇంజినీర్ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

220 మందికి కంటి వైద్య పరీక్షలు


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సంధ్య, చిత్రంలో ఆడారి శ్రీనివాసరావు

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు దుర్గానగర్ గ్రంథాలయంలో వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఆదేశాల మేరకు ఏటీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. దీన్ని వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఆడారి శ్రీనివాసరావు ప్రారంభించి మాట్లాడారు. ఆరోగ్యంగా ఉన్ననాడే ఏదైనా సాధించగలమన్నారు. కంటి వైద్యురాలు డాక్టర్ సంధ్య నేతృత్వంలో 220 మంది రోగులకు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో 52,56,57 వార్డుల క్లస్టర్ ఇన్‌చార్జి పల్లా ఎర్నికుమార్ యాదవ్, గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ, గ్రామ కమిటీ సభ్యులు పాత్రపిల్లి వెంకటరమణ, యలమంచలి వెంకటరావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కాయిత పైడి రత్నాకర్, సచివాలయ కన్వీనర్లు ఎస్.రమణ, యలమంచలి రాజు, వెన్న సంతోష్‌రాజ్, నమ్మి శశికుమార్, నమ్మి లీలా, ప్రమీల, స్వప్న దేవి, ఉష, వలంటీర్లు పాల్గొన్నారు.

మణిపూర్‌లో మారణకాండపై నిరసన ర్యాలీ


ర్యాలీలో పాల్గొన్న నవజ్యోతి మహిళా సంఘం ప్రతినిధులు

మల్కాపురం: మణిపూర్‌లో మహిళలపై జరిగిన మారణకాండను నిరసిస్తూ స్థానిక నవజ్యోతి పరస్పర సహాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో 61వ వార్డు మల్కాపురంలో శనివారం నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీని నవజ్యోతి మాక్స్ డైరెక్టర్ సంగీత ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత స్త్రీని ఇతర దేశాల వారు ఎంతో గౌరవిస్తుంటే.. మన దేశంలోని మణిపూర్ రాష్ట్రంలో అదే స్త్రీలను నగ్నంగా ఊరేగిస్తున్నారని ఆవేదన చెందారు.ఇలాంటి సంఘటను చూస్తుంటే మనం ఏ నాగరికతలో ఉన్నామనే బాధ కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలను ప్రతి ఒక్క మహిళా వ్యతిరేకించాలని, ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించిన నాడే మహిళలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు,సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థినికి చెక్ అందజేత


అనితకు చెక్కు అందిస్తున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం: సీతం కళాశాలలో బీటెక్ చదువుతున్న కె. అనితకు అమెరికన్ ప్రొగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ ద్వారా వచ్చిన చెక్‌ను శనివారం డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ జీవీఎంసీ కార్యాలయంలో అందించారు. ఏటా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అమెరికన్ ప్రొగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ ప్రోత్సాహకాలు అందిస్తుంది. ఈ ఏడాది ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి 52 మంది విద్యార్థులకు నదు ప్రోత్సాహకాలు అందించింది. అందులో భాగంగా వచ్చిన 230 డాలర్ల చెక్కును జియ్యాని శ్రీధర్ ఆమెకు అందించి అభినందించారు.

ఏయూలో ఆంగ్ల పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వ విద్యాలయం ఆంగ్ల విభాగం అధ్యాపకులు డాక్టర్ ఎస్. రవి విన్సెంట్ రచించిన గ్లీనింగ్స్ ఆఫ్ గేజింగ్ పుస్తకాన్ని వర్సిటీ ఉపకులపతి ఆచార్య పి.వి.జి.డి. ప్రసాద్‌రెడ్డి శనివారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆంగ్ల విభాగం ఆచార్యులు డాక్టర్ ఎన్. సాల్మన్ బెన్నీ ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ పుస్తకంలో ప్రజాస్వామ్య ఉల్లంఘన, జీవితంలో, సమాజంలోని రుగ్మతలు, సమస్యాత్మక వ్యాధులు, మూఢ నమ్మకాలు, పోలికలు– వైరుధ్యాలు, ఆశతో కూడిన దుర్భర జీవితాలు, అశాంతి, జింగోయిజం వంటి విభిన్న ఇతివృత్తాలను డాక్టర్ ఎస్. రవి విన్సెంట్ ఉద్వేగభరితంగా వివరించారు. యుద్ధ ప్రభావం, మానవ జీవితంలో వివిధ రూపాల్లో బాధలు, ప్రేమ కోసం వాంఛ, ప్రపంచంలోని అసమానతలు వంటి అనేక సమస్యలు ఈ పుస్తకంలో రచయిత చర్చించారు.

'ఉక్కు' ప్రైవేటీకరణపై కేంద్రం పునరాలోచించాలి


దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ విషయాన్ని కార్మికుల భవిష్యత్తు కోసం పునరాలోచించాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారానికి 926వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సంస్థకు చెందిన ఆర్ అండ్ డీ, టెలికాం, ఈటీఎల్ విభాగాల కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగంలోనే కొనసాగిస్తామని పార్లమెంట్‌లో ప్రకటన చేయాలని కోరారు. లేని పక్షంలో బీజేపీకి వచ్చే ఎన్నికల్లో డిపాజిట్లు కూడా దక్కవని హెచ్చరించారు. భారత రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తూ ప్రధాని మోదీ తన నిరంకుశత్వ పాలనతో అన్యాయంగా విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. దేశంలో సంపద సృష్టించలేని బీజేపీ ప్రభుత్వానికి దేశ సొత్తు అయిన ప్రభుత్వరంగ సంస్థలను అమ్మే హక్కు ఎవరిచ్చారని ప్రశ్నించారు. ప్లాంటును పూర్తి స్థాయి ఉత్పత్తి దిశగా నడపవలసిన యాజమాన్యం కావాలనే నష్టాల వైపు నెట్టే ప్రయత్నాలు చేస్తోందన్నారు. ఇకనైనా కుటిల రాజకీయాలను వదిలి, స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించి ఉత్పత్తి దిశగా నడపాలని డిమాండ్ చేశారు.

ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శిగా నాగేశ్వరరావు

అగనంపూడి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శిగా పరవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్, లంకెలపాలేనికి చెందిన ఎం.వి.నాగేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి వెంకట లక్ష్మమ్మ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు పనిచేసిన ఎ.శేఖర్‌కు ప్రధానోపాధ్యాయునిగా పదోన్నతి రావడంతో ఆయన స్థానంలో నాగేశ్వరరావును నియమించారు. ఆయన రెండేళ్ల పాటు ఈ పదవిలో ఉంటారు. నాగేశ్వరరావుకు పీఈటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.గోపీనాథ్, సీహెచ్.పెద్దినాయుడు, లంకెలపాలెం హైస్కూల్ హెచ్ఎం రౌతు నాగేశ్వరరావు అభినందనలు తెలిపారు.